


# మూడు నిద్రలు

-రచన-

బి. హేమమాల

శోభనం నాటిరాత్రి భర్త అన్న మాటలు విని మాధవి విపరీత విధానంలో ఆశ్చర్యపోయింది.

"నాకు నలభై ఏళ్ళు. ఈ వయస్సులో మళ్ళీపెళ్ళి ఎంత వద్దన్నా, మా అమ్మ, నాన్న వినలేదు. ఫలితంగా, నాకు ఇష్టం లేకండా నువ్వీ ఇంట్లోకివచ్చావ్. నేను గంగని మరిచిపోలేను. ఆమెతో ఇరవై ఏళ్ళు కాపురం చేసాను. చివరి రోజుల్లో ఈ ఇద్దరు పిల్లలు పుట్టారు. వాళ్ళు కని పిస్తోంటే నా గంగ నాకు గుర్తుకు రాకండా వుండగలదా? అంతేకాదు. ఈ ఇంట్లో ఎటు చూచినా- గంగ గుర్తులే కనిపిస్తోంటాయ్. అవన్ని చూడకండా నేను ఎట్లా ఉండనూ? అన్నీ మరిచి, గంగని మరిచి- నీతో సుఖంగా ఉండటం నాకు సాధ్యం కాదు" అన్న గోపాల్ మాటలు విని మాధవి ఆశ్చర్యపోయింది. కొంచెం సేపు బెదిరిపోయింది, భయపడిందిగూడా. కాని తన అక్క ఒకామె ఈ రకంగా రెండవ భార్యగా పెళ్ళి ఇంచుమించు ఈ రకం పరిస్థితిలోనే- ఆత్మహత్య చేసుకున్న విషయం స్ఫురణకి రాగానే తన ధైర్యానికి బలం, శక్తి ఇచ్చుకుంది.

తన తండ్రికి ఎనిమిదిమంది ఆడ పిల్లలు. చెప్పుకోతగ్గ ఉద్యోగం కాదు తండ్రిది. మరి ఇందరికి పెళ్ళి—ఈ కాలానికి చేయాలంటే- ఏ ముసలివాడికో- భార్యావిహీనుడికో తప్ప మార్గం లేదాయె

కొంచెం ఆగి తిరిగి గోపాల్ అన్నాడు.

"మాధవీ! నేను చాలా ప్రయత్నం చేసాను. నీలో నా గంగని చూడాలని. కాని సాధ్యం కావడం లేదు" అని.

గోపాల్ మాటలు పూర్తిగాకముందే మాధవి చిన్నగానవ్వి కొంచెం ఆగి—

"మీ దగ్గర చాలా రకాల అసమర్థత వున్నట్టు కనిపిస్తోంది" అంది.

గోపాల్ అదిరిపడి మాధవి ముఖంలోకి చూచాడు. ఇరవై ఏళ్ళకే మాధవి ఎంతో గంభీరంగా వుంది.

"నేను అసమర్థుడినా!?" అవిశ్వాసం, ఆశ్చర్యం, ఓ రకం అహంకారం గూడా ధ్వనించే స్వరంతో అడిగాడు.

మాధవి అతని మాటకి సమాధానం ఇవ్వకండా,

"మరి నన్ను పెళ్ళెందుకు చేసుకున్నారో ఆ విషయమైనా మీకు తెలుసా?" అడిగింది.

"నా పిల్లలకి తల్లి కావాలని."

"మీకు భార్యకానిదే మీ పిల్లలకి తల్లి ఏలా ఔతుంది?"

"నేను మళ్ళీ కనబోవడం లేదు- ఇప్పుడున్న పిల్లలకే లతకి, కేశవ్‌కి తల్లి కావాలి."

"ఆ తల్లి చచ్చిపోయిందని, చచ్చిపోయినవాళ్లు తిరిగిరారని గూడా మీకు తెలియదా?"పరిహాసం చేస్తోన్నట్టుగా అంది.

ముందుగా గోపాలానికి కోపం వచ్చింది. మాధవి అంటున్న విధానానికి. ఐనా సంబాళించుకుని-

"నువ్వు ఎన్ని మెలికలుగా మాటాడినా భర్తగా నానించి ఏరకం సుఖం దొరకదు."

"మరింత బాధ్యత తెలియని వారు- పెళ్ళెందుకు చేసుకున్నారు."

"పెద్దల బలవంతంవల్ల ...."

"ఆ పెద్దలే- నన్ను మిమ్మల్ని ఈ గదిలోకి పంపించింది" స్త్రీ సహజమైన-సిగ్గు అడ్డం వస్తోన్నా- ఈ మాటలంది మాధవి.

"ఆడదానివై వుండిగూడా .... ఎంత సిగ్గులేకండా మాటాడ్తున్నావ్!" అసహ్యించుకున్నాడు గోపాల్.

"సిగ్గు నాకుకాదు. మీకుండాలి. ఆడదాని ముందు, భార్యముందు- మగమనిషై- భర్తై, గూడా- నన్ను దూరంగా వుండమని చెప్పటానికి....ఈ విషయం ఏమిటో___ మీ పెద్దలనే అడుగుతాను...." మూసివున్న తలుపులవేపు నడిచింది.

"ఆగు మాధవీ...." దిశలు దద్దరిల్లేలా గోపాల్ గర్జించాడు. మాధవి వెనక్కైనా తిరిగి చూడకండా ముందుకే వెళ్ళిపోయింది.

*　　　　*

రెండవరోజు శోభనం గదిలో గోపాల్ మాధవి కోసం అసహనంగానిరీక్షిస్తోన్నాడు. ఒకచోట నిలవలేక అటు ఇటు పచార్లు చేస్తున్నాడు. తనని అంతమాటన్న మాధవిని ఓ ఆడదాన్ని ముఖ్యంగా పెళ్ళాన్ని ఏం చేయాలో తోచక- యాతన పడసాగాడు.

గదిలోకి మాధవి అడుగు పెట్టగానే బొమికెలిరగ తన్నాలన్న భావం క్షణం కోసం వచ్చిపోయింది. చదువుకున్నవాడు- సభ్యత సంస్కారాలంటుకున్నవాడు - ఈ రకం పని తనవల్ల కాదు అని తానే అనుకున్నాడు గోపాల్. మరేంచేయాలి మాధవిని....!? గోపాల్ యోచిస్తోనే వున్నాడు- గదిలోకి మాధవి రానే వచ్చింది. క్రొత్త చీర- చేతిగాజులు, వేళ్ళ గొల్సులు- ఉంగరాల చప్పుళ్ళతో గదిలో అడుగుపెట్టింది.



తన పంజాలుకి వచ్చిన మేక వైపు పులి చూచినట్టుగా- మాధవి వైపు చూచాడు గోపాల్.

కాని మాధవి ఇదేం లెక్క-పెట్టనట్టుంది. కాస్సేపు గదంతా తిరిగిచూచి- తర్వాత వెళ్ళి- ఎంతో నిర్లక్ష్యంగా మంచంమీద పడుకుంది.

ఈ రోజైనా మాధవి తనని బ్రతిమాల్తుందని, కాళ్లు పట్టుకుని—పతిభిక్ష, ప్రేమభిక్ష పెట్టమని- తనని యాచిస్తుందని- కన్నెరికం విడిపించి తల్లి అయ్యే యోగ్యతని ప్రసాదించమని వేడుకుంటుందని- అలాటి సందర్భం చూచుకుని— పురుగుని విదిలించినట్టుగా మాధవిని- విదిలించాలని- వీలైతే- శాశ్వతంగానే ఇంట్లోనించి పంపించి వేయాలని అప్పటికప్పుడు- అనుకుంటున్న గోపాల్- అహం చాలా రకాలుగా దెబ్బతింది- మాధవి ప్రవర్తనకి.

ఇంకా ఓర్చుకోలేక పోయినప్పుడు—

"ఏయ్! ఆ మంచం మీదినించి లే-" అన్నాడు. మాధవి- ఆ వైపునించి ఇంకో వైపు తిరిగి పడుకుంది.

"మాధవీ! నేను మంచిగా చెప్తోన్నాను. ఆ మంచం మీదినించి లే.... వెంటనే ఈ గదిలోనించి గూడా వెళ్ళిపో.... లేకపోతే ఏం చేస్తానో నాకే తెలియదు-" కోపాన్ని కంఠాన్ని అదుపులో పెట్టుకుంటోనే అన్నాడు గోపాల్.

"నాకు తెలుసు. మీరు ఏం చేయలేరు. మరీ నిదురగా వుంది. నన్ను విసిగించ కండి. ప్లీజ్" అంది కళ్లు మూసుకునే-

"ఆ? ఇంత అహంకారమా?" ఇంక ఆగలేకపోయాడు. విరవిరా వెళ్ళి, మంచం మీదినించి మాధవిని- రెక్కపట్టుకుని లేపి "ఇది నా మంచం, నా గంగ పడుకున్న మంచం, దీనిమీద పడుకునే అధికారం నీకు లేదు. వెళ్ళిక్కడినించి—ఊఁ...." గర్జించాడు.

ఈ అనాగరికతని చూచి- తనని తాను సర్దుకోవటానికి- మాధవికి కొంచెం సమయం పట్టింది. తర్వాత ఎంతో శాంతంగా భర్తవైపు చూస్తూ-

"ఎక్కడికి వెళ్ళమంటారూ?" అడిగింది ఎంతో స్థిమితంగా.

"ఎక్కడికైనా వెళ్ళు...."

"ఎక్కడికైనా అంటే-!?"

"నాకు తెలియదు."

"మరి మీకు తెలిసిందేమిటి?"

"ముందీ గదిలోనించి బైటకు వెళ్లు."

"ఎందుకు వెళ్లాలి?"

"నాకు ఇష్టంలేదు కాబట్టి."

"ఆ విషయం నాతోకాదు. మీ అమ్మ గారితో నాన్నగారితో చెప్పండి. కథంతా అరటిపండు ఒలచినట్టుగా చెప్పినా- అంతా విని మళ్ళీ నన్ను పంపించారు. వాళ్ళతో చెప్పుకోండి ఏమైనా...."

తల్లితండ్రి మాట రాగానే కోపంనించి కొంచెం తేరుకున్నాడు గోపాల్.

"వాళ్లు పూర్తిగా వృద్ధులైపోయారు. ఈ వయస్సులో వాళ్ళని బాధపెట్టడం ఇష్టం లేక- వాళ్ళ మనశ్శాంతికోసం, నా పాపల్ని కొంచెం జాగ్రత్తగా చూచుకోవటానికోసం ఈ పెళ్ళి చేసుకోవడం తప్పనిసరై పోయింది. ఈ విషయం నీకు నిన్ననే చెప్పాను."

"ఔను, ఇంకా చాలా చెప్పారు. కాని మీరు కేవలం మీ అమ్మ, నాన్నలగురించి- పాపలగురించి- చచ్చిపోయిన మీ భార్య గురించే యోచిస్తే సాగదు. నా గురించి గూడా యోచించాల్సివుంటుంది. పెళ్ళంటూ చేసుకున్నారు కాబట్టి...."

"ఆ విషయం గురించిగూడా నిన్ననే చెప్పాను. భర్తగా నేను ఉండలేనని- నాకు సాధ్యం కాదని...."

"మరి ఈ ఆర్భాటం....ఈ తతంగం అంతా ఎందుకు జరిపించారు. పెళ్ళిపందిట్లో పుస్తిగట్టే ముందన్న ఈ మాట చెప్తే, మీకు ఏ రాఖో కట్టివెళ్ళిపోయేదాన్ని. చచ్చినా, మీ చేత మంగళసూత్రం కట్టించు కునేదాన్నికాదు. నాకేం తెల్సు ఈ రకం భర్తలుగూడా ఉంటారని .... పెళ్ళికన్నా ముందు ఈ విషయం నాతో మీరెందుకు చెప్పలేదు?"

"ఈ వివరాలన్నీ మాటాడుకునే వ్యవధి మీ వాళ్ళైనా మా వాళ్ళైనా ఎక్కడిచ్చారు!?"

"పెళ్ళప్పుడు ఈ రకం వివరాలుగూడా ఉంటాయి మాటాడుకోవటానికని- మా

వాళ్లు అనుకోరు. ఇహ మీ వాళ్ళ సంగతి.... కోపం వచ్చే చేయమంటారూ!?....పోతే- ఇప్పటికైనా నల్గురిముందు ఈ విషయం చెప్పి, ఈ పెళ్ళికైన-మావాళ్ళ ఖర్చులు.... తర్వాత- నాతో ఈ రకం ఆట ఆడినందుకు కొంత పెనాల్టీ చెల్లించుకోండి వెళ్ళి పోతాను....అంతేకాని, ఈ మంచం నా గంగది, ఆ పరువు నా రంగది అంటే నాకేం అర్థం కావు."

"నువ్వింత బరితెగించిన ఆడదానివా!?" నిర్ఘాంతపోయాడు గోపాల్.

"నాకు నిదురవస్తోంది. ఏ విషయం యోచించుకుని రేపు చెప్పండి. ఈ గదికి బైటినించి గొళ్ళెంపెట్టారు. ఇక్కడ పడు కోవటం తప్పనిసరి....నేలమీద పడుంటే- నిదురపట్టదు" అని వెళ్ళి మంచంమీద పడుకుని నిదురపోయింది మాధవి.

ఓ రాత్రివఅకు గోపాల్ యోచిస్తో కూర్చున్నాడు .... ఎంతసేపైనా ఇంకా నిదురరానప్పుడు- మాధవిని నిదురలేపి-

"నీకు నేను డబ్బివ్వాలా" అడిగాడు.

"ఔను" కళ్ళు మూసుకునే అంది మాధవి.

"ఎందుకివ్వాలి?"

"ఆ వివరాలన్నీ అప్పుడే చెప్పాను."

"హు! నీ తండ్రి బీదవాడని, నువ్వో దిక్కులేనిదానివని, కానీ కట్నం లేకండా నిన్ను పెళ్ళికి ఒప్పుకున్నారు మావాళ్లు...."

గోపాల్ మాటలు పూర్తిగాకముందే- మాధవి బలవంతంగా కళ్ళుతెఅచి- నులుము కుని- కళ్ళు రెపరెప లాడిస్తో గోపాల్ ముఖంలోకి చూచి కొంచెం గట్టిగా నవ్వి-

"నా తండ్రి ధనవంతుడై కట్నం ఇవ్వగల్గే పరిస్థితిలోవుంటే- మిమ్మల్ని పెళ్ళిచేసుకునే గతి నా కెందుకు పట్టేది.... నాకు తగ్గ కుఱ్ఱాణ్ని పెళ్ళిచేసుకునేదాన్ని. అతనికి ఎన్ని నియమాలున్నా మంచంమీద పడుకోని నియమమైతే ఉండేది కాదు. ఈ కాస్త అర్థంకాకేనా- ఈ రాత్రి నన్ను లేపారు...." అని మళ్ళీ నవ్వింది.

"ఛీ-ఛీ-నువ్వంటే- నాకు అసహ్యం పుడుతోంది" చీదరించుకున్నాడు గోపాల్.

"మరి మీరంటే నాకు భక్తిగా- ప్రేమగా వుందను కుంటున్నారా .... పరమ అస హ్యంగా వుంది."

"నోర్మూయ్...."

"రాత్రిపూట ఈ కేకలు గూడా ఎందుకు- పైనవాళ్ళకిగూడా నిద్దర్లేకండా- వెళ్ళి పడు కోండి-" స్థిమితంగా అంది.

"నువ్వో ఆడదానివేనా?" మాధవి పడుకున్న మంచం దగ్గరకు వచ్చి అడి గాడు.

"ఐనా కాకపోయినా మీ కెందుకూ?" మళ్ళీ నిర్లక్ష్యంగానే నవ్వింది.


"తంతాను జాగ్రత్త...."

"ఆ పని చేసేవా రీమాటనరు."

"చంపేస్తాను___"

"___" నవ్వింది.

వెంటనే గోపాల్___విసురుగా బాల్కనీ వైపు వెళ్ళిపోయాడు.




మాధవి స్థిమితంగా కళ్లు మూసుకుని పడుకుంది కాని, నిదురరాలేదు. మనస్సులో మస్తిష్కంలో చాలా పెద్ద తుఫాను, అల జడి బైలుదేరి ఆమె ప్రశాంతత అనేక విధాలుగా భంగపడింది.

తెల్లవార్తోన్న అలికిడి వినిపిస్తోంది. మాధవి నిదురపోలేదు. బాల్కనిలోనించి తన మంచంపైపే వస్తోన్న గోపాల్ కనిపించగానే నిదుర నటించడానిక్కి కళ్ళు మూసుకుంది.

"మాధవీ .... మాధవీ .... " తట్టి లేపాడు.

"తెల్లవారింది. వెళ్ళిపో...." గోపాల్ కంఠస్వరానికి మాధవికి ఆశ్చర్యం జాలి కలిగాయి. మనిషి సహనపరుడిలానే వున్నాడు పాపం! కాని మగమనిషి కింత సహనంగూడా వుంటుందా అనుకుంది.

మంచంమీదే లేచి కూర్చుని- చీర- జుత్తు సవరించుకుంటూ-

"మీ కోపం పోయినట్టుంది" అంది.

"నీ పైన కోపం నా కెందుకూ?"

"మరింకెవరి మీదుంటుందీ?"

"తన మనిషి అనబడే మనిషిమీద...."

"నేను మీ మనిషిని కానా?"

"ఐతే ఇన్ని మాటలు మాటాడగల్గే దానివా? మాటాడనిచ్చేవాళ్లా- ఒళ్లంతా నుజ్జునుజ్జు చేసేవాళ్ళు- ఈ తిక్కమాట లకి...."

"అబ్బే! ఆ కాలం పోయింది లెండి. మా ఆడవాళ్ళు ఇప్పుడు వూరుకోవడం

లేదు. ఒకటివేస్తే రెండు వేస్తున్నారు. సిగ్గులకి ఏ మగమనిషి చెప్పుకోవటం లేదు కాని....ఐనా పత్రికల్లో కార్టూన్సుని మీరు చూడరా ఏమిటి?" ఎంతో స్థిమితంగా- ముసిముసిగా నవ్వుతూ అడిగింది.

"నువ్వు చాలా తెలివితక్కువ దానివి."

"కాబట్టి మిమ్మల్ని చేసుకున్నాను."

"ఔను. అదీ నిజమే. నన్ను పెళ్ళి చేసుకున్నా, ఇంత ఐశ్వర్యం వున్నా నన్ను వదిలి పోతానని అనడం నీ తెలివి తక్కువే. ఇంక బైటకు వెళ్లు. మళ్ళీ రాత్రికి రాబోక. వీలైతే ఇప్పుడే శాశ్వతంగా మా ఇంటినించి వెళ్ళిపో...."

"వెళ్ళిపోవటానికేం ఇప్పుడే ఈ క్షణంలోనే వెళ్ళిపోతాను- కాని నన్ను పంపించడం- మీకే ఇష్టం లేనట్టుంది."

"నాకా—!? ఛీ ఛీ...."

"లేకపోతే- చేతిలో డబ్బులేకండా ఈ మాట లెందుకూ?"

"ఓహో....అదా! అదే దొర్కుతుంది. డబ్బందగానే- ఒక్కక్షణం నా ఇంట్లో వుండగూడదు- మళ్ళీ నీ ముఖం నాకు కనిపించగూడదు—"

"మీ ముసలి ముఖం చూస్తో కూర్చోవాలని- నేనేం తపించిపోవడం లేదు లెండి—" మంచం మీదినించి క్రిందికి దిగింది.

"షటప్—"

ముందుకు వెళ్తుందల్లా ఆగి వెనక్కి తిరిగి- గోపాల్‌ని చూచి- చిలిపిగా నవ్వి వెళ్ళిపోయింది.

మూడవనాడు రాత్రిగూడా మాధవి గదిలోకి రావడం చూచి ఉగ్రుడైపోయాడు గోపాల్.

"నువ్వు కోరినంత డబ్బిచ్చాకగూడా ఇంకా నువ్విక్కడెందుకున్నావ్?" తీవ్రమైన స్వరంతో అడిగాడు.

"మీ వాళ్ళు వెయ్యి కళ్ళతో నన్ను కనిపెట్టుకుని చూస్తున్నారు."

"నా గదిలోకి ఎందుకొచ్చావ్?"

"మీ అమ్మా నాన్నా, గడపవతల వుండి నన్ను లోపలికి పంపించారు."

"ఐనా ఎందుకొచ్చావ్!" ఇహ అదుపులో పెట్టుకోలేక గట్టిగానే అరిచాడు.

"ఏమిటి నాన్నా—"

మంచంలో పడుకున్న కేశవ్ లత పరుగెత్తుకుని వచ్చారు.

"అరె! కేశూ! లత....మీరు ఇక్కడ వున్నారా?" పిల్లలని దగ్గరకు తీసుకుని అడిగింది మాధవి.

"ఔను పిన్నీ- నాన్నమ్మవాళ్లు చూడకండా- నాన్న మా ఇద్దర్నీ- పట్టుకొచ్చారిక్కడికి...."

"మాధవీ! దయచేసి నువ్విక్కడినించి వెళ్ళు—" గోపాల్ అన్నాడు.

"పిన్నిగూడా ఇక్కడే వుండనీ నాన్నా....!"కేశవ్ మాటలకి—"మీకామె పిన్నికాదు" అన్నాడు గోపాల్.

"మరే మాటుంది నాన్నా?" లత మాటలకి—మాధవి—"అక్కా నౌతాను" అనగానే- గోపాలం అదిరి మాధవి ముఖం లోకి చూచాడు. మాధవి ముఖం ఎంతో నిర్మలంగా- అమాయకంగా వుంది.

"అక్కా! మరి బావ ఎక్కడా...." చప్పట్లు చరుస్తూ నవ్వుతూ అడిగింది లత.

"మా ఇంటిదగ్గర నాకోసం ఎదురు చూస్తూ వుంటాడు" పిల్లలతో మాధవి మాటలు పెంచి కథలు చెప్పి నిదుర పుచ్చింది.

"ఎవరినో ప్రేమించి- నన్ను పెళ్ళి చేసుకున్నావా?" పిల్లలు నిదురపోగానే- మాధవిని నిలదీసి అడిగాడు గోపాల్.

"ఏం ఇద్దరు ఇద్దరు పిల్లలుండగా మీరు నన్ను పెళ్ళాడిందానికన్నా తీసిపోయిందా?...." మాధవి ఇంకేదో అనబోయింది- మధ్యలోనే గోపాల్ "ఇహ ఇప్పటికైనా ప్రయాణం ఐ వెళ్లు- తెల్లవారటానికి ఎంతోసేపు లేదు....వెళ్ళు.... నీ ప్రియుడు నీ కోసం చూస్తో వుంటాడు-" అన్నాడు.

"వెళ్తాను వెళ్తాను...." అల్లరిచేసే పాపాయిని సమాధానపరుస్తోన్న స్వరంతో అని- అక్కడినించి కదిలింది. మాధవి చేతిలో ఓ సంచి వుంది. ఆ సంచినిండా డబ్బువుంది. ఆ డబ్బుని తన ప్రాణాల కన్నా అధికంగా- జాగ్రత్త చేసుకుని వెళ్తోంది. బావ నిరుద్యోగి- నిర్ధనుడు. కట్నం ఆశకి- తన మేనత్త- తన బావకు- తనని వద్దంది. ఈ డబ్బు అత్త చేతికిస్తుంది. బావ తనని పెళ్ళి చేసుకుంటాడు. ఈ డబ్బుతో బావ ఏదైనా వ్యాపారం చేస్తాడు- ఇద్దరూ ఎంతో సుఖంగా బ్రతకొచ్చు. తండ్రినిగూడా తానే పోషించవచ్చు....ఓ రోజు తనకిగూడా- ఒక్కరో ఇద్దరో పాపలు పుడ్తారు....వాళ్లు బాగా అల్లరిచేస్తే- కథలు చెప్తుంది... ఏవేవో యోచిస్తో- చీకట్లో ముందుకు నడుస్తోన్న మాధవికి- కొంచెం సేపటికి ఉదయ కిరణాలు కనిపించాయి. గోపాల్ మదిలో మెసిలాడు—

కృతజ్ఞతా భావంతో- మనస్సంతా నిండిపోయింది. కేశవ్-లత, ముసలాళ్లు ఇద్దరూ గుర్తుకు వచ్చారు.

వాళ్ళంతా సుఖంగా సంతోషంగా ఉండనీ....ఆ ఇల్లు ఇంకా వైభవంగా వర్ధిల్లనీ....తనకి తోచినట్టుగా ఆశీర్వదిస్తోంది.

గోపాల్ని మాధవి క్షమించింది కాని, మాధవిని సంఘం క్షమిస్తుందా? ఏమో! సంఘ నియమాల గురించి చిన్నం ఎత్తు ఆలోచించకండా- ఆ ఉదయ కాంతిలో- ముందుకే నడిచి వెళ్తోంది మరి మాధవి....